ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నవంబర్ 13 శుక్రవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 34 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

FRIDAY NOVEMBER 13 2026 | VOL:1 | ISSUE: 34 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM



జూన్ 2 నాటికి టిమ్స్‌లు పూర్తి స్థాయి సేవలందించాలి

ఏడాదిలో ఉస్మానియా సేవలు ప్రజలకు అందాలి

మూడు టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలు

నిమ్స్... టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి

వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయండి

వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 12 :

వచ్చే జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్ బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఉస్మానియా నూతన ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలందించేలా చూడాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్స కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మూడేళ్లలోనే 9 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు,






(మిగతా 3వ పేజీలో..)

2047 వరకు వేచి చూడాల్సిన పనిలేదు..

అంతకంటే ముందే వికసిత భారత్: ప్రధాని మోదీ



వికసిత భారత్ లక్ష్యం అందుబాటులోనే ఉందన్న ప్రధాని మోదీ

2047 అనేది డెడ్‌లైన్ కాదు, నిరంతర లక్ష్య సాధన మార్గమని వెల్లడి

దేశ విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలని మీడియాకు పిలుపు

స్వాతంత్ర్య ఉద్యమంలా చిన్న లక్ష్యాలతోనే పెద్ద గమ్యానికి చేరతామన్న ప్రధాని

'వికసిత భారత్' లక్ష్యం మనకు పూర్తిగా అందుబాటులోనే ఉందని, ఇటీవలి సంవత్సరాలలో దేశం సాధించిన విజయాలే దీనికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. 2047వ సంవత్సరాన్ని మనం వేచి చూడాల్సిన డెడ్‌లైన్‌గా కాకుండా, ఆ లక్ష్యం దిశగా నిరంతరం పురోగతి సాధించాల్సిన మార్గంగా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'దీపావళి మిలన్ సమారోహ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర

(మిగతా 3వ పేజీలో..)

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ.. జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం



హైదరాబాద్‌లో మార్స్ జీసీసీ కేంద్రం ప్రారంభం

మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

జెన్‌పాక్ట్ భాగస్వామ్యంతో సరికొత్త కేంద్రం ఏర్పాటు

త్వరలోనే వెయ్యి మంది నిపుణుల స్థాయికి విస్తరణ

ఏఐ క్లౌడ్ ఇంజనీరింగ్‌పై ప్రధాన దృష్టి

హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న క్రమంలో మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఇక్కడ తన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రఖ్యాత సంస్థ 'మార్స్' (మిఠాయి), ఐటీ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' (+వఅజూఘష్) భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను గురువారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు.ఈ సరికొత్త కేంద్రం ప్రస్తుతం 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ప్రారంభ దశలో భాగంగా 400 నుంచి 525 మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగనున్నాయి. భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే కాలంలో మరో 70,000 చదరపు అడుగుల స్థలాన్ని జోడించి, ఉద్యోగుల సంఖ్యను

(మిగతా 3వ పేజీలో..)

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదు.. మంత్రి పొన్నం హెచ్చరిక

ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్న పొన్నం

ఉద్యోగులు ఎక్కడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచన

ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్న మంత్రి

ఉచిత బస్సు వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని ప్రకటన

ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబానికి నియామక పత్రం



(మిగతా 3వ పేజీలో..)

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్ సీపీగా మహేష్ భగవత్.. ఫైర్ సర్వీసెస్ డీజీగా సజ్జనార్

హైదరాబాద్, నవంబర్ 12 :





తెలంగాణలో ప్రభుత్వం భారీగా ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. పోలీస్ శాఖతో పాటు ఏసీబీ, జైళ్ల శాఖ, ఆర్టీసీ, పౌరసరఫరాలు, ట్రాఫిక్ తదితర కీలక విభాగాల్లో మార్పులు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 21 మంది అధికారులకు బదిలీలు, పోస్టింగులు, అదనపు బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా 1995 బ్యాచ్‌కు చెందిన మహేష్ మురళీధర్ భగవత్‌ను నియమించింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న వి.సి. సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్

(మిగతా 3వ పేజీలో..)

22-ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

పెండింగ్ దరఖాస్తులన్నీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి

ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదు

ప్రతి వారం జిల్లా స్థాయిలో సమీక్షలు నిర్వహించాలి

పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి కమిటీకి పంపాలి

యూఎల్‌సీ సమస్యలపై వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలి

జీవో 59, 76, 118 అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

22-ఎ నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ



లక్ష్మమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిషేధిత భూముల జాబితాలో చోటు చేసుకున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ

(మిగతా 3వ పేజీలో..)

ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

యుద్ధాల తీరు వేగంగా మారుతున్న నేపథ్యంలో దేశానికి ఏ రూపంలోనైనా ముప్పు ఎదురయ్యే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. అవసరమైన సందర్భాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించేందుకు

(మిగతా 3వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీగా బదిలీ చేసింది. ఆయనకు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. జైళ్ల శాఖ డీజీగా ఉన్న డాక్టర్ సౌమ్య మిశ్రాను మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీపీగా నియమించింది. స్వాతి లక్రాను జైళ్ల శాఖ డీజీగా నియమించి హోంగార్డ్స్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. చారు సిన్హాను ఏసీబీ డీజీగా నియమించి సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు కొనసాగించింది. డాక్టర్ అనిల్ కుమార్‌ను టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించగా, ఇప్పటివరకు ఆర్టీసీ ఎండీగా ఉన్న వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించింది. ఫైర్ సర్వీసెస్ డీజీగా ఉన్న విక్రమ్ సింగ్ మాన్‌ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ఆపరేషన్స్ డీజీపీగా నియమించింది. డాక్టర్ సౌమ్య మిశ్రా -- డీజీపీ, మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా. స్వాతి లక్రా -- జైళ్ల శాఖ డీజీ; హోంగార్డ్స్ అదనపు బాధ్యతలు. మహేష్ మురళీధర్ భగవత్ -- హైదరాబాద్ పోలీస్ కమిషనర్. చారు సిన్హా -- ఏసీబీ డీజీ; సీఐడీ డీజీపీ అదనపు బాధ్యతలు. డాక్టర్ అనిల్ కుమార్ -- టీజీఎస్ఆర్టీసీ వీసీ, ఎండీ. వి.సి. సజ్జనార్ -- ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీ; ఎస్పీఎఫ్ డీజీ అదనపు బాధ్యతలు. వై. నాగిరెడ్డి -- పౌరసరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ. సంజయ్ కుమార్ జైన్ -- అదనపు డీజీపీ, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్; ట్రైనింగ్ అదనపు బాధ్యతలు. విక్రమ్ సింగ్ మాన్ -- డీజీపీ (ఆపరేషన్స్), గ్రేహౌండ్స్, ఆక్టోపస్; పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అదనపు బాధ్యతలు. ఎం. స్టీఫెన్ రవీంద్ర -- తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్. అకున్ సబర్వాల్ -- అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్); కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ అదనపు బాధ్యతలు. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి -- ఏసీబీ డైరెక్టర్. కార్తికేయ -- మల్టీజోన్-1 ఐజీ; ఐసీసీసీ డైరెక్టర్ అదనపు బాధ్యతలు. కె. రమేష్ నాయుడు -- రైల్వేస్ ఐజీ. డి. జోయల్ డేవిస్ -- రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్; హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ అదనపు బాధ్యతలు. జి. చందన దీప్తి -- డీఐజీ, జోన్-7, జోగులాంబ అదనపు బాధ్యతలు. ఆర్. భాస్కరన్ -- డీఐజీ, ఇంటెలిజెన్స్ అదనపు బాధ్యతలు. కె. నారాయణ నాయక్ -- డీఐజీ, జోన్-2, బాసర అదనపు బాధ్యతలు. ఎల్.ఎస్. చౌహాన్ -- డీఐజీ, కోఆర్డినేషన్; జోన్-6, చార్మినార్ అదనపు బాధ్యతలు. బాలాదేవి -- డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్), టీజీ - టీమార్స్. వి. అరవింద బాబు -- డీసీపీ, ఎస్ఎం అండ్ ఐటీ, హైదరాబాద్ సిటీ. కొత్త నియామకాలు, అదనపు బాధ్యతలు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ..
జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 1,000 మంది మార్స్ అసోసియేట్స్ స్థాయికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కేంద్రం ప్రధానంగా అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), సాఫ్ట్‌వేర్ అండ్ క్లౌడ్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్ వంటి కీలక టెక్నాలజీ విభాగాల్లో హైదరాబాద్ కేంద్రం నుంచి గ్లోబల్ సేవలు అందనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలను అందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించనుంది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్నికర్స్, ఎం అండ్ ఎమ్స్, పెడిగ్రీ, రాయల్ కెనైన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంతటి గుర్తింపు ఉన్న సంస్థ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణలో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, ప్రతిభావంతులైన మానవ వనరులు ఐటీ రంగ విస్తరణకు చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్స్ మరియు జెన్‌పాక్ట్ బృందాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

కూడా సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఢిల్లీలో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన పద్ధతులను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవా

శత్రువుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ముప్పును ముందుగానే గుర్తించే సామర్థ్యాలను పెంపొందించుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. ప్రమాదం సంభవించిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు సమాచారంతో అప్రమత్తమై నష్టాన్ని నివారించేలా వ్యవస్థలను సిద్ధం చేసుకోవాలన్నారు. గూఢచార, నిఘా యంత్రాంగాలను మరింత బలోపేతం చేయాలని, ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు ప్రతిక్షణం సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.శత్రువుల వ్యూహాలకు దీటైన ప్రతిస్పందన

శత్రువులు కోలుకునేందుకు అవకాశం ఇవ్వని రీతిలో రక్షణ దళాలు తమ సామర్థ్యాలను పెంచుకోవాలని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఆకస్మిక దాడులు జరిగినా శత్రువుల వ్యూహాల్లో చిక్కుకోకుండా ముందుగానే అప్రమత్తమయ్యేలా సైన్యం బలపడాలని సూచించారు. మన రక్షణ చర్యలు శత్రువుల అంచనాలకు అందని విధంగా ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా వేగంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.

సైబర్, అంతరిక్ష యుద్ధాలపై దృష్టి

భవిష్యత్తులో సైబర్ యుద్ధాలు, అంతరిక్షంలో ఆయుధాలను మోహరించి శత్రువులపై దాడులు చేసే ఆధునిక యుద్ధ పద్ధతులు మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు వైమానిక దళం ప్రత్యేక విధానాలు, వ్యూహాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికత, నిఘా, రక్షణ సామర్థ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని స్పష్టం చేశారు.

జూన్ 2 నాటికి టిమ్స్‌లు పూర్తి స్థాయి సేవలందించాలి

(మొదటి పేజీ తరువాయి)

28 పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు.సనత్ నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానం పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్ మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సీఎం సూచించారు. టిమ్స్ ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపైనే దృష్టి సారించే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. నిమ్స్ లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్ నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిమ్స్‌లో బెడ్స్ లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా సనత్ నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. టిమ్స్ లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటి నుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్నమరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. టిమ్స్ తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుప్రతుల్లో వైద్యులు, సిబ్బంది హాజరైన సమయం, విధుల నుంచి వెళ్లే సమయాన్ని నమోదు చేయాలని, హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలయ్యేలా చూడాలని, ఏఐతో పర్యవేక్షణ చేయాలని సీఎం శాఖాధికారులను ఆదేశించారు. మూడేళ్లలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల (ఓపి) సంఖ్య 7 లక్షల నుంచి 9 లక్షలకు పెరగడం, ఇన్ పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని సీఎం తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులును ఎంత మొత్తమైనా విడుల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ముషారఫ్ అలీ ఫరూఖీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి ఇలంబరితి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

2047 వరకు వేచి చూడాల్సిన పనిలేదు.. అంతకంటే ముందే వికసిత భారత్: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. “భారత్ నేడు సాధిస్తున్న విజయాల దృష్ట్యా, వికసిత భారత్ లక్ష్యం మనకు అందనంత దూరంలో లేదు” అని అన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఆయన ఉదహరించారు. “ఒకప్పుడు ఊహించడానికే కష్టంగా ఉన్న మైలురాళ్లను భారత్ ఇప్పుడు అందుకుంటోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపి భారత్ చరిత్ర సృష్టిస్తుందని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా ఎదుగుతుందని ఎవరైనా ఊహించారా? గత 12 ఏళ్లలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను నిర్మించుకున్నాం. మన యూపీఐ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా నిలిచింది. ఇవన్నీ సాధించగలిగినప్పుడు, వికసిత భారత్ కలను కూడా మనం కచ్చితంగా సాకారం చేసుకోగలం. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి నిర్మిస్తారని ఎవరు భావించారు?” అని ప్రధాని పేర్కొన్నారు.గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వచ్చిన మార్పును ఆయన ఉదహరించారు. “మిత్రులారా.. 12 ఏళ్ల క్రితం నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా పెద్ద విజయంగా భావించేవారని గుర్తుంచుకోండి. నేను ముఖ్యమంత్రిగా ఉన్న తొలి రోజుల్లో గ్రామాలకు వెళితే, కరవు పనుల్లో భాగంగా మా ఊరికి కనీసం ఒక రోడ్డు వేయించండి సారూ అని వినతిపత్రాలు ఇచ్చేవారు” అని ఆయన గుర్తుచేసుకున్నారు. పేదరిక నిర్మూలన విషయంలో ప్రభుత్వాల వైఖరిలో వచ్చిన మార్పును కూడా మోదీ వివరించారు. “ఒకప్పుడు ప్రతి నాయకుడు ఎర్రకోట నుంచి పేదరికాన్ని నిర్మూలిస్తామని నినదించేవారు. అది ఒక మంత్రంలా ఉండేది. ప్రతి ఎన్నికలోనూ పేదరికాన్ని పోగొడతామని హామీలు ఇచ్చేవారు. కానీ నేడు, పేదలు స్వయంగా పేదరికం నుంచి బయటపడుతున్నారు. పేదరికం తగ్గుముఖం పట్టడం మనం చూస్తున్నాం” అని తెలిపారు.వికసిత భారత్ లక్ష్యంపై మాట్లాడుతూ, ప్రధాని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉదాహరణగా చూపారు. “సంపూర్ణ స్వాతంత్ర్యం అనేది ఒకటి రెండు రోజుల్లో సాధ్యపడలేదు. క్రమంగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అదే విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో కనిపిస్తోందని, అదే మనల్ని వికసిత భారత్ లక్ష్యం వైపు నడిపిస్తుంది” అని పేర్కొన్నారు.భారతదేశ విజయగాథలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. “21వ శతాబ్దంలో కమ్యూనికేషన్ అనేది అతిపెద్ద బలం. మనకు యువ జనాభా, ప్రతిభ, టెక్నాలజీ, చౌకైన డేటా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచానికి చెప్పడానికి మన దగ్గర ఒక అద్భుతమైన కథ ‘ఇండియా స్టోరీ’ ఉంది. నా ‘మన్ కీ బాత్’ కార్యక్రమం ద్వారా దేశ ప్రజల విజయాలకు నేను నిరంతరం ఒక వేదిక కల్పిస్తున్నాను. భారత మీడియా కూడా దేశ విజయాలను చాటిచెప్పే కథనాలపై పనిచేసి, వాటిని ముందుకు తీసుకెళ్లాలి. ఇది దేశానికి చేసే గొప్ప సేవ అవుతుంది” అని ప్రధాని కోరారు. అనంతరం దీపావళి, నవరాత్రి, ఛత్ పూజ పండుగల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదు.. మంత్రి పొన్నం హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి)

మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత అయితే, ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసి ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. ఆయన కుమారుడు హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో ఉద్యోగ నియామక పత్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ ఇప్పటికే పరిహారం అందించాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం ద్వారా సుమారు రూ.కోటి సాయం చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ఆయన కుమారుడికి ఉద్యోగం కల్పించామని చెప్పారు.

22-ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మొదటి పేజీ తరువాయి)

విషయంలో ఎలాంటి జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

కలెక్టర్లతో మంత్రి సమీక్ష

హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో సమావేశమయ్యారు. ఆయా జిల్లాల్లో 22-ఎ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. భూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

22-ఎ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు సమన్వయంతో పనిచేయాలని, పరిష్కారంలో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రతి వారం జిల్లా స్థాయిలో సమీక్ష

22-ఎ భూ సమస్యల పరిష్కారానికి ప్రతి వారం జిల్లా స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

యూఎల్‌సీ, జీవోల అమలుపై దృష్టి

యూఎల్‌సీ సమస్యలకు సంబంధించి వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు. జీవో 59, 76, 118 అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ ఉత్తర్వుల పరిధిలోని అంశాలను పరిశీలించి, అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు చర్యలు

22-ఎ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఆయా ఆస్తులకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన భూ యజమానులకు త్వరితగతిన న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రభుత్వ భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

రైతులకు అండగా స్థానిక ధాన్యం కొనుగోళ్లు!

- **కీతవారిగూడెంలోనే మిర్యాలగూడ మార్కెట్ ధర.. రవాణా ఖర్చులకు విముక్తి**
- **ట్రాక్టర్ల కోసం గంటల తరబడి నిరీక్షణకు చెక్.. 10--15 నిమిషాల్లోనే అన్‌లోడింగ్!**

గరిడేపల్లి, నవంబర్ 12(ప్రజానేస్తం జ్వాల):

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులకు కొంత ఉపశమనం కలగనుంది. ధాన్యం విక్రయాల కోసం మిర్యాలగూడ, హుజూర్‌నగర్ మార్కెట్లకు వెళ్లి రవాణా ఖర్చులు భరించడంతో పాటు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితికి ప్రత్యామ్నాయంగా కీతవారిగూడెం సమీపంలోనే ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు.గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామ శివారు సర్వారం రోడ్డులోని శ్రీ శ్రీనివాస స్టోన్ క్రషర్ మిల్లులో నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.ఇ మిర్యాలగూడ మార్కెట్ ధరల ప్రకారం కొనుగోళ్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం సన్న రకం ధాన్యం (సింట్లు నంబర్-1) క్వింటాల్‌కు రూ.3,900 నుంచి రూ.4,000 వరకు ధర లభించే అవకాశం ఉందని తెలిపారు.

రైతులకు రవాణా భారం తగ్గింపు.. సమయం ఆదా!

దూరప్రాంత మార్కెట్లకు ధాన్యం తరలించాలంటే ట్రాక్టర్ కిరాయి, డీజిల్ ఖర్చులు రైతులకు అదనపు భారంగా మారుతున్నాయి. అక్కడికి చేరుకున్న తర్వాత ధాన్యం దిగుమతి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని స్థానికంగానే



ధాన్యం కొనుగోలు సదుపాయం కల్పిస్తున్నట్లు మిల్లు నిర్వాహకులు తెలిపారు.మిల్లుకు ధాన్యం తీసుకొచ్చిన ట్రాక్టర్లను కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే అన్‌లోడింగ్ చేసి పంపించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా కానుంది.

స్థానిక రైతులకు అందుబాటులో మరో అవకాశం!

కీతవారిగూడెం, సర్వారం గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. పంట అమ్మకాల్లో రైతులకు ఇబ్బందులు తగ్గించి, స్థానికంగానే ధాన్యం విక్రయించుకునే వెసులుబాటు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.

కాకీ యూనిఫాం వెనుక ఎన్నో కష్టాలు..

- **కనిపించేది విధి నిర్వహణే..**
- **కనిపించనిది త్యాగాల జీవితం!**
- **కుటుంబానికి దూరంగా.. ప్రజల రక్షణే ధ్యేయంగా.. నిరంతరం విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది..**

సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమించే పోలీసుల జీవితం అంత సులభమైనది కాదు. మనకు కనిపించేది వారి ఒంటిపై ఉండే కాకీ యూనిఫాం మాత్రమే. కానీ ఆ యూనిఫాం వెనుక ఎన్నో నిద్రలేని రాత్రులు, కుటుంబానికి దూరంగా గడిపే క్షణాలు, ఎండా వానలను లెక్కచేయని విధులు, ఎన్నో త్యాగాలు దాగి ఉంటాయి.పండుగైనా, పబ్బమైనా, వర్షమైనా, ఎండైనా పోలీసులకు విధి నిర్వహణే మొదటి ప్రాధాన్యత. ప్రజలంతా కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగలు జరుపుకుంటుంటే, పోలీసులు మాత్రం రోడ్లపై, కూడళ్లలో, బందోబస్తు విధుల్లో కనిపిస్తుంటారు. తమ పిల్లల పుట్టినరోజులు, కుటుంబ వేడుకలు, బంధువుల శుభకార్యాలు సైతం విధుల కారణంగా వదులుకోవాల్సిన సందర్భాలు ఎన్నో ఉంటాయి.రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రమాదాలు జరిగినప్పుడు ముందుగా చేరేది పోలీసులే. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను నియంత్రించడం నుంచి శాంతిభద్రతల పరిరక్షణ వరకు ప్రతి బాధ్యతను భుజాన వేసుకుంటారు. కొన్నిసార్లు విమర్శలు ఎదురైనా, ఒత్తిళ్లు వచ్చినా తమ విధిని మాత్రం నిర్వర్తిస్తూనే ఉంటారు.ఒక్కసారి ఆలోచించాలి... మనం ప్రశాంతంగా నిద్రపోతున్న సమయంలో కూడా మన భద్రత కోసం ఎవరో ఒకరు రోడ్లపై కాపలా కాస్తున్నారు. మన కుటుంబంతో గడిపే సమయాన్ని వారు ప్రజల భద్రత కోసం వెచ్చిస్తున్నారు.కాకీ యూనిఫాం



అంటే కేవలం ఒక ఉద్యోగానికి గుర్తు కాదు.. అది బాధ్యతకు, క్రమశిక్షణకు, త్యాగానికి ప్రతీక.పోలీసుల తప్పులను ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉన్నట్లే, వారి కష్టాలను గుర్తించి గౌరవించడం కూడా మన బాధ్యత. విధి నిర్వహణలో వారికి సహకరించడం, వారితో మర్యాదగా వ్యవహరించడం ప్రతి పౌరుడి కనీస బాధ్యత.ఎందుకంటే కాకీ యూనిఫాం వెనుక కూడా ఒక మనిషి ఉంటాడు.. అతనికీ కుటుంబం ఉంటుంది, భావోద్వేగాలు ఉంటాయి, వ్యక్తిగత జీవితమూ ఉంటుంది. పోలీసుల సేవలను గుర్తిద్దాం.. వారి త్యాగాలను గౌరవిద్దాం.. కాకీ యూనిఫాంకు సెల్యూట్ చేద్దాం!

...నాగిల్ల రజినీకాంత్

రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం ఉండకూడదు

పరకాల, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజా సమస్యలు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.గురువారం పరకాల ఆర్డీవో కార్యాలయంలో వివిధ రెవెన్యూ అంశాలపై ఎమ్మెల్యే, కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా రెవెన్యూ సమస్యలు, దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూ రీసర్వే ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో అధికారులు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని పేర్కొన్నారు.అలాగే భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటిని సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. భూముల సరిహద్దులు, రికార్డులకు సంబంధించిన అంశాల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రెవెన్యూ శాఖకు సంబంధించిన ఏ ఒక్క దరఖాస్తు కూడా అనవసరంగా పెండింగ్‌లో ఉండకూడదని వారు స్పష్టం చేశారు. ప్రతి



దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల పురోగతి, పరిష్కార వివరాలను సంబంధిత దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే, కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్లు, సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలి

సూర్యాపేట, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయకపోవడంపై ఆశా కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలన్నింటినీ బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు.ఈ మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీష్ రెడ్డిని ఆశా వర్కర్లు, వారి అనుబంధ సంఘాల నాయకులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందజేసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తమను కంటికి రెప్పలా కాపాడుకున్నారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కనీసం జీతాలు సక్రమంగా చెల్లించలేని ప్రభుత్వం ప్రమాద బీమా కల్పిస్తామని చెప్పడం వల్ల తమకు ఒరిగేదేమిటని ప్రశ్నించారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలన్నింటినీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న నిరవధిక



సమ్మెకు ప్రజలు, వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలపాలని, ఆశా కార్యకర్తలకు అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు.

జీవో నంబర్ 9ను తక్షణమే రద్దు చేయాలి.. విద్యార్థులపై నిర్బంధం ఆపాలి

హైదరాబాద్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



విద్యార్థులను అరెస్టు చేసి జైళ్లలో పెట్టేందుకు ఉద్దేశించిన జీవో నంబర్ 9ను తక్షణమే రద్దు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం హిమాయత్‌నగర్‌లోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై నిర్బంధ చర్యలు చేపట్టడం సరికాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల ఫీజులను పూర్తిగా భరించాలని, ప్రస్తుతం ఇస్తున్న రూ.5 వేల స్కాలర్‌షిప్‌ను రూ.15 వేలకు పెంచాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఫీజు బకాయిల కారణంగా ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తగిన బడ్జెట్ లేదని చెప్పడం సమంజసం కాదని, విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేసి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పల్నాటి యాదయ్య, విజయుడు పాల్గొన్నారు.

గణేష్ చౌక్ అగ్నిప్రమాద బాధితులకు న్యాయం చేయాలి.. లేకుంటే ప్రజా ఉద్యమం

- **ఐదు దుకాణాలు దగ్ధం.. రూ.12 లక్షల ఆస్తి నష్టం**
- **బాధితులకు తక్షణ పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని రవి పటేల్ డిమాండ్**

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



జిల్లా కేంద్రంలోని గణేష్ చౌక్ రోడ్డుపై ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు ఫుట్‌పాత్ దుకాణాలు పూర్తిగా దగ్ధమై, సుమారు రూ.12 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.గురువారం ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఆయన బాధిత దుకాణ యజమానులను పరామర్శించి, నష్ట వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి విపత్తు సహాయ నిబంధనల ప్రకారం అర్హులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. నిధులు అందుబాటులో లేవని అధికారులు తెలిపినట్లు రవి పటేల్ వెల్లడించారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులు కేటాయించి బాధిత ఐదు కుటుంబాలను ఆదుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే ఒక్కో దుకాణానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరారు.గతంలో రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు, దుకాణాల నిర్మాణానికి సహాయం చేస్తామని అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని రవి పటేల్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ సమస్యను పరిష్కరించలేదన్నారు. అటవీ శాఖ పరిధిలోని స్థల సమస్యను కలెక్టర్, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో పరిష్కరించి, చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని దుకాణాలు నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు డీఎఫ్ఓతోనూ ఫోన్‌లో మాట్లాడి బాధితులకు చట్టపరమైన పరిష్కారం చూపాలని కోరినట్లు తెలిపారు. అధికారులు స్పందించకపోతే బాధితులతో కలిసి ఆందోళనలు చేపడతామని, న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, అధికార ప్రతినిధి మడే సంతోష్, జినుకల శ్రీను, అశోక్, చంద్రశేఖర్, లక్ష్మణ్, ప్రసాద్, రామ్ చరణ్, బాధిత దుకాణ యజమానులు, స్థానికులు పాల్గొన్నారు.

యాసంగిలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

నడికూడ, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామ రైతువేదికలో ఆత్మ (ATMA) ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమంలో యాసంగి సాగు ప్రణాళిక, పంటల మార్పిడి, నీటి యాజమాన్యం, సమగ్ర చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం అనిశ్చితి, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు పంట ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వరికి అధిక నీరు అవసరమయ్యే నేపథ్యంలో శనగ, పెసర, మినుము, వేరుశనగ, ఆవాలు వంటి ఆరుతడి పంటలను భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు చేయాలని కోరారు. TRVK శాస్త్రవేత్త డాక్టర్ బి.వి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులు వినియోగించాలని, పంటల మార్పిడితో నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పప్పుధాన్యాల సాగు ద్వారా భూసారం మెరుగుపడుతుందని వివరించారు. సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, శాస్త్రీయ సిఫారసుల మేరకే పురుగుమందులు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జంగే భాస్కర్, జోరు ప్రశాంత్, సూత్రపు గోపినాథ్, మాదారపు రామకృష్ణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలి

- **రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి**
- **ప్రజల్లో సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు, మాదకద్రవ్యాలపై విస్తృత అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్**

సూర్యాపేట, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిందితులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాద సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లా పోలీసు అధికారుల నెలవారీ నేర సమీక్షలో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సూర్యాపేట డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజా భద్రత తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన తీవ్రమైన, అతి తీవ్రమైన నేరాలు, మిస్సింగ్ కేసులు, ఎన్బీడబ్ల్యూ కేసుల దర్యాప్తు పురోగతిని ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసులను ఛేదించడంతో పాటు నాన్ బెయిలబుల్ వారెంట్లను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ముఖ్యంగా తీవ్రమైన నేరాల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా దర్యాప్తు చేయాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడినప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. దర్యాప్తు సమయంలో ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని, రాష్ట్ర పోలీసు శాఖ అందించిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, టూల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పీఎం రహత్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ (ప్రివీ–న్యూరో) పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ఈ పథకం కింద సూర్యాపేట జిల్లాలో 38 ఆసుపత్రులను గుర్తించామని, ప్రమాద బాధితులకు ఉచిత అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాద సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి

నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ప్రతి గ్రామంలోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలతో పాటు ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పోలీసు వాహనాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

పోలీసు అధికారులకు కేటాయించిన వాహనాల నిర్వహణ, పనితీరును ఎస్పీ పరిశీలించారు. ప్రతి వాహనానికి క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించాలని, అత్యవసర సమయాల్లో తక్షణమే వినియోగించుకునేలా సిద్ధంగా ఉంచాలని డ్రైవర్లను ఆదేశించారు. విధి నిర్వహణకు అవసరమైన కమ్యూనికేషన్ సెట్లు, ఎమర్జెన్సీ కిట్లు వాహనాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, సత్యయ్య ప్రసన్న కుమార్, సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మగ్దుం అలీ, జిల్లా ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, వెంకటయ్య, ఉపేందర్ రావు, రాజశేఖర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.68 కోట్లతో కాలనీల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

జవహర్‌నగర్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



మేడ్చల్--మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.1.68 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. చంద్రపురి కాలనీలో రూ.1.36 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి, జవహర్‌నగర్ డివిజన్‌లోని గాంధీనగర్ కాలనీలో రూ.32 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చంద్రపురి డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్‌నగర్ డివిజన్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్, డీసీసీ కార్యదర్శి సదానందం, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పదో తరగతి ఉత్తమ ఫలితాలే లక్ష్యం.. విద్యార్థులకు డీఈఓ సూచనలు

పరకాల, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పరకాలను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా ప్రగతిని, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు.పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన డీఈఓ.. వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని, నిరంతర అధ్యయనం, పునశ్చరణతో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న అడాప్షన్ కార్యక్రమం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన ప్రగతి, పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యా కార్యక్రమాల నిర్వహణ, పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరకాల విద్యాధికారి చిలువేరు సురేందర్, జిల్లాస్థాయి అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉట్నూరులో సాంస్కృతిక సంబరాలకు రూ.7 లక్షలు మంజూరు

ఉట్నూరు, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులోని చారిత్రక గోండు రాజుల కోటలో సాంస్కృతిక సంబరాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7 లక్షల నిధులు మంజూరు చేసింది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవతో ఈ నిధులు కేటాయించినట్లు సమాచారం.ఈ మేరకు పర్యాటక, సాంస్కృతిక శాఖ పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గోండు రాజుల చారిత్రక వారసత్వం, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయ కళారూపాలను ప్రోత్సహించడంతో పాటు స్థానిక కళాకారులకు వేదిక కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతిపాదిత సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించే బాధ్యతలను సంబంధిత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగించారు. ప్రభుత్వ నిధులతో ఉట్నూరులో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు మార్గం సుగమం కావడంతో స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

భూభారతి స్లాట్‌ల రీఫండ్‌లో జాప్యం

హైదరాబాద్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

భూభారతి పోర్టల్‌లో భూ సంబంధిత సేవల కోసం స్లాట్ బుక్ చేసుకుని, వివిధ కారణాలతో వాటిని రద్దు చేసుకున్న దరఖాస్తుదారులకు రీఫండ్ చెల్లింపులు ఆశించిన స్థాయిలో జరగడం లేదనే విషయం గణాంకాల ద్వారా వెల్లడవుతోంది. స్లాట్ రద్దు చేసుకున్నప్పటికీ చెల్లించిన రుసుము తిరిగి అందక పలువురు దరఖాస్తుదారులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 31,314 స్లాట్లు రద్దు కాగా, వారిలో కేవలం 4,574 మంది దరఖాస్తుదారులకు మాత్రమే రీఫండ్ చెల్లించినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. మొత్తం సుమారు రూ.100.57 కోట్లు తిరిగి చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.12.97 కోట్లు మాత్రమే చెల్లించినట్లు వెల్లడవుతోంది. దీంతో మిగిలిన రీఫండ్ మొత్తాల చెల్లింపుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భూభారతి పోర్టల్ ద్వారా సేవలు పొందేందుకు రుసుములు చెల్లించిన ప్రజలకు, స్లాట్లు రద్దు చేసుకున్న తర్వాత నగదు తిరిగి చెల్లించడంలో జాప్యం జరుగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. రీఫండ్ ప్రక్రియలో జాప్యానికి కారణాలేమిటి? పెండింగ్‌లో ఉన్న మొత్తాలను ఎప్పటిలోగా చెల్లిస్తారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పెండింగ్ రీఫండ్‌లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేసి దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై ప్రభుత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది.



గట్ల నర్సింగాపూర్, కొప్పూర్ గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక

భీమదేవరపల్లి, నవంబర్ 12 (ప్రజా నేస్తం జ్వాల):



భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్, కొప్పూర్ గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో ఈ కమిటీల ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య మాట్లాడుతూ.. సమాజంలో కొనసాగుతున్న కులవివక్షతను నిర్మూలించేందుకు ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి ఆశయాలు, విలువలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కమిటీల ద్వారా ప్రజలకు రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో కులవివక్షకు తావులేకుండా, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం లభించేలా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

గట్ల నర్సింగాపూర్ గ్రామ కమిటీ:

అధ్యక్షులు: సట్ల రాంబాబు

ఉపాధ్యక్షులు: నగరబోయిన నాగరాజు, పెద్దబోయిన హరికృష్ణ

ప్రధాన కార్యదర్శి: బొల్లంపల్లి జోషఫ్

కో–ఆర్డినేటర్: రాంపెల్లి రాజీవాచారి

సహాయ కార్యదర్శులు: చిలుక ప్రమోద్, పొన్నాల మురళి, మాడుగుల ప్రణయ్ దేవ్, బోనగిరి ప్రభాకర్, మాడుగుల కృష్ణ, మాడుగుల అమర్.

కొప్పూర్ గ్రామ కమిటీ:

అధ్యక్షులు: మిర్జాల రాజు

ఉపాధ్యక్షులు: రచ్చ సంపత్, కొమ్ముల ప్రసాద్, ఉట్మూరి నరేష్, కొమ్ముల రాజు, గడిపె రాజేందర్

ప్రధాన కార్యదర్శి: సంగెం శ్రీనివాస్

కో–ఆర్డినేటర్: కొమ్ముల నగేష్

సహాయ కార్యదర్శులు: కొమ్ముల సుదర్శన్, గుడికందుల తిరుపతి, గద్ద అజయ్, గుడికందుల రంజిత్, తూముల రంజిత్, బాకీ సమ్మయ్య. రెండు గ్రామాల కమిటీలకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు గ్రామస్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ, కులవివక్ష నిర్మూలన, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

ఆధునిక సాగుకు నానో ఎరువులే మార్గం

- **రైతులకు నానో ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు**
- **ఇఫ్కో ఆధ్వర్యంలో కార్యక్రమం.. 150 మంది రైతుల హాజరు**

భీమదేవరపల్లి, నవంబర్ 12 (ప్రజా నేస్తం జ్వాల):

ఆధునిక వ్యవసాయంలో నానో ఎరువుల వినియోగం ద్వారా పంటలకు అవసరమైన పోషకాలను సమర్థవంతంగా అందించవచ్చని వ్యవసాయ నిపుణులు పేర్కొన్నారు. రైతులు సంప్రదాయ ఎరువుల వినియోగంతో పాటు నానో ఎరువుల పిచికారీ పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.భీమదేవరపల్లి మండలం ములుకనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో ఇఫ్కో ఆధ్వర్యంలో గురువారం నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 150 మంది రైతులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వ్యవసాయ నిపుణులు మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు.పంటలకు అవసరమైన పోషకాలు సమతుల్యంగా అందేలా ఎరువులను వినియోగించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, జొన్న తదితర పంటల్లో నానో ఎరువులను ఏయే దశల్లో పిచికారీ చేయాలి, ఎంత మోతాదులో ఉపయోగించాలి అనే అంశాలను వివరించారు. నానో ఎరువుల వినియోగ విధానం, పంటల పెరుగుదలలో వాటి ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ములుకనూరు సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, జనరల్ మేనేజర్ ఎం. రాం రెడ్డి, ఇఫ్కో ప్రతినిధులు జె. అక్షయ్ రెడ్డి, షిండే విశాల్, మండల వ్యవసాయ అధికారి పద్మ, టీఆర్‌వీకే శాస్త్రవేత్త డాక్టర్ ఇ. నర్సయ్య, సొసైటీ వ్యవసాయ అధికారులు ముచ్చ అచ్యుత రెడ్డి, సంగ శ్రీనివాస్, బి. స్వామిరావు, ఎం. సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



8,540 మందికి చేయూత పెన్షన్లు మంజూరు



ఆసిఫాబాద్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 8,540 మందికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కే. హరిత, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.జిల్లావ్యాప్తంగా చేయూత పింఛన్ల కోసం మొత్తం 9,460 మంది దరఖాస్తు చేసుకోగా, పరిశీలన అనంతరం అర్హులుగా గుర్తించిన 8,540 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి సంక్షేమ పథకం వివరాలను తెలియజేశారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలి

ఆసిఫాబాద్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

అటవీ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కే. హరిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో శాఖల మధ్య సమన్వయం పాటిస్తూ నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు.గురువారం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో అటవీ పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అటవీ అనుమతులకు సంబంధించిన అంశాలు, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు.అటవీ శాఖ అనుమతులు పొందిన ప్రాంతాల్లో రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న భూ సమస్యలు, వివాదాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు.అలాగే నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణంపై దృష్టి సారించాలని తెలిపారు. అటవీ సంపద, పర్యావరణాన్ని కాపాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.36 కోట్ల నిధులు మంజూరు

- **త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం**
- **సికింద్రాబాద్ డివిజన్ రైల్వే డీఆర్ఎం డాక్టర్ గోపాలకృష్ణన్**

కాగజ్‌నగర్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ.36 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సికింద్రాబాద్ డివిజన్ రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) డాక్టర్ గోపాలకృష్ణన్ వెల్లడించారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను గురువారం సందర్శించిన డీఆర్ఎం డాక్టర్ గోపాలకృష్ణన్‌ను సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రైల్వే ప్రయాణికుల సమస్యలు, రైల్వే స్టేషన్ అభివృద్ధి, కొత్త రైళ్ల ఏర్పాటు, పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించడం వంటి అంశాలపై వినతిపత్రాలు అందజేశారు.కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా 2, 3వ నంబర్ ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఆర్ఎం రూ.36 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.

కొత్త రైళ్లు, అదనపు స్టాపింగ్‌లకు ఎమ్మెల్యే విజ్ఞప్తి

సికింద్రాబాద్ జంక్షన్ నుంచి కాగజ్‌నగర్ మీదుగా హౌరా వరకు బెంగాలీ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త రైలును ప్రవేశపెట్టాలని ఎమ్మెల్యే కోరారు. లక్నో ఎక్స్‌ప్రెస్, భగత్ కి కోఠి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కాగజ్‌నగర్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తున్న నేపథ్యంలో అదనపు కోచ్‌లను జత చేయాలని కోరారు. అలాగే సిర్పూర్ రైల్వే స్టేషన్‌లో కాజీపేట--బల్లార్షా ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ ఇవ్వాలని, కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను సిర్పూర్ టౌన్ వరకు పొడిగించాలని ప్రతిపాదించారు.బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలును నిరంతరం కొనసాగిస్తూ రెగ్యులర్ రైలుగా మార్చాలని ఎమ్మెల్యే కోరారు. రైల్వే ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్ఎంను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైలు యాత్రి సేవా సమితి సభ్యులు పవన్ బజ్జేవా, అరుణ్ లోయ, ప్రయాగ్ తివారి, అనిల్ కుమార్, రైల్వే సీనియర్ డీఈఎన్ అభిరామ్, సీనియర్ డీఓఎం, ఇతర రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



భూ రీ సర్వే అభ్యంతరాలను చట్ట ప్రకారం పరిష్కరిస్తాం

- **రైతులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ చంద్రశేఖర్**
- **సింగారంలో భూ రీ సర్వేపై గ్రామసభ నిర్వహణ**

మునుగోడు, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



భూముల రీ సర్వేలో భాగంగా జారీ చేసిన నోటీసులపై రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను చట్ట ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. భూముల హద్దుల నిర్ణయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తామని స్పష్టం చేశారు.మునుగోడు మండలం సింగారం గ్రామంలో భూముల రీ సర్వేపై జారీ చేసిన నోటీసులకు సంబంధించి వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికి నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు రీ సర్వే వివరాలను, రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను కలెక్టర్‌కు వివరించారు.గ్రామంలో మొత్తం 255 ఖాతాలు ఉండగా, 417 ల్యాండ్ పార్సెల్ మ్యాపులు (ఎల్‌పీఎంలు) రూపొందించినట్లు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించి మొత్తం 59 అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు.గ్రామకంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములు, రహదారులు, పట్టా భూములను సమగ్రంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు.భూముల హద్దుల నిర్ణయం చట్ట ప్రకారమే జరుగుతుందని, రైతులు తమ అభ్యంతరాలకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. సాధ్యమైనంత వరకు అభ్యంతరాలను తగ్గించుకునేలా రైతులు సహకరించాలని కోరారు. రానున్న రోజుల్లో అభ్యంతరాల స్వీకరణకు కేవలం 25 రోజుల గడువు మాత్రమే ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ గ్రామసభలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, స్థానిక సర్పంచ్ ఆండాలు, తహసీల్దార్, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ

- **గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవకాశం**
- **నవంబర్ 14లోగా దరఖాస్తు చేసుకోవాలి**



సూర్యాపేట, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

మైనారిటీ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే లక్ష్యంతో నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీలు, బౌద్ధ మతాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. టీజీపీఎస్సీ గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 పరీక్షలతో పాటు టీజీపీఆర్‌బీ పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించనున్నారు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా తమ దరఖాస్తులను సూర్యాపేట జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన మైనారిటీ యువత సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు

ధర్మసాగర్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరులో ఎలాంటి టార్గెట్ లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని తెలిపారు.ధర్మసాగర్ మండలంలోని సుష్మిత గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన చేయూత నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్, రాంపూర్ గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు రూ.19.43 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, 27 మంది లబ్ధిదారులకు రూ.27.03 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. తుర్కకాశ గ్రామానికి చెందిన 15 మంది మైనారిటీ లబ్ధిదారులకు రూ.9 లక్షల విలువైన వివిధ రకాల టూల్ కిట్లను పంపిణీ చేశారు.

మండలంలో 729 మందికి కొత్త పింఛన్లు

ధర్మసాగర్ మండలంలో ఐదు కేటగిరీల కింద మొత్తం 729 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీరిలో 370 మంది వితంతువులకు రూ.7,45,920, 209 మంది దివ్యాంగులకు రూ.8,39,344, 44 మంది ఒంటరి మహిళలకు రూ.88,704, 102 మంది గీత కార్మికులకు రూ.2,05,632, నలుగురు చేనేత కార్మికులకు రూ.8,064 చొప్పున నెలవారీ పింఛన్లు అందనున్నాయి. మొత్తంగా ప్రతి నెలా రూ.18,87,664 లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు పింఛన్ల కోసం నాలుగైదేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కేటగిరీల్లో కొత్తగా 4.50 లక్షల పింఛన్లు మంజూరయ్యాయని, ఇప్పటికే ఉన్న పింఛన్లతో కలిపి సుమారు 45 లక్షల మందికి ఏటా రూ.12 వేల కోట్లతో పింఛన్లు అందిస్తున్నట్లు వివరించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం: ఎంపీ కడియం కావ్య

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం అమలవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు స్థానిక సంస్థల్లో బాధ్యతలు చేపట్టినప్పుడు స్వతంత్రంగా విధులు నిర్వహించేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శేషాద్రి, హనుమకొండ డీఆర్‌డీవో శ్రీనివాస్, తహసీల్దార్ భావ్‌సింగ్, ఎంపీడీవో అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, అధికారులు, పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ అభివృద్ధి నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ధర్మసాగర్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



ధర్మసాగర్ మండల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సుమారు రూ.104 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ కృషిని ప్రస్తుత అభివృద్ధి ఖాతాలో వేసుకోవడం సరికాదని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి ప్రశ్నించారు.ధర్మసాగర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ప్రత్యేక చొరవతో మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ నాయకత్వం సహకారంతో రాజకీయంగా ఎదిగిన కొందరు, ప్రస్తుతం పార్టీ మారి అభివృద్ధి పనులన్నీ తమ కృషితోనే జరిగినట్లు చెప్పుకోవడం సరికాదని విమర్శించారు.ధర్మసాగర్ మండలానికి గతంలోనే రూ.104 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు సమకూరినప్పటికీ, ప్రస్తుతం రూ.14 కోట్ల నిధుల గురించే ప్రస్తావించడం ద్వారా గత ప్రభుత్వ కృషిని విస్మరిస్తున్నారని ఆరోపించారు. గతంలో మంజూరైన పనుల వివరాలు, వాటికి నిధులు తీసుకొచ్చిన వారి కృషిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని డిమాండ్ చేశారు.అభివృద్ధి అంటే గతంలో మంజూరైన పనులకు కొత్తగా పేరు పెట్టుకోవడం కాదని, వాటిని నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమని అన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న రహదారులు, మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి పనులపై ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రాజకీయ విమర్శలకు బదులుగా అభివృద్ధి పనులపై చర్చకు రావాలని కడియం శ్రీహరికి సవాల్ విసిరారు.ధర్మసాగర్ అభివృద్ధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాటికొండ రాజయ్య చేసిన కృషిని ప్రజలు గుర్తుంచుకుంటారని రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను నగదు జమ చేయని వార్డు అధికారి సస్పెండ్

హనుమకొండ, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో వసూలు చేసిన ఆస్తిపన్ను నగదును మున్సిపల్ ఖజానాలో జమ చేయని వ్యవహారంలో వార్డు అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. కాశిబుగ్గ సర్కిల్-1 పరిధిలోని 43వ డివిజన్ వార్డు అధికారి ఎం.ఏ. గఫార్ ఖాన్‌ను సస్పెండ్ చేస్తూ హనుమకొండ జిల్లా కలెక్టర్, వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.సదరు అధికారి వసూలు చేసిన రూ.1,13,452 ఆస్తిపన్ను నగదును మున్సిపల్ ఖజానాలో జమ చేయలేదని అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాకుండా అధికారి వద్ద ఉన్న మున్సిపల్ రికార్డులు, రశీదు పుస్తకాలను తక్షణమే సంబంధిత అధికారులకు అప్పగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



ఖతార్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

- **టామ్‌కామ్ ద్వారా నియామకాలు.. నెలకు రూ.73 వేల నుంచి రూ.95 వేల వరకు వేతనం**
- **20--40 ఏళ్ల వయసు గల అర్హులైన అభ్యర్థులకు అవకాశం**

సూర్యాపేట, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):


ఖతార్‌లో నర్సింగ్ విభాగంలో ఉద్యోగాలు పొందాలనుకునే అభ్యర్థులకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) అవకాశం కల్పిస్తోంది. లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్సులు (ఎల్‌పీఎన్), నర్స్ టెక్నీషియన్ల (ఎన్‌టీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.నర్స్ టెక్నీషియన్ పోస్టులకు నెలకు రూ.73,000, లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్స్ పోస్టులకు నెలకు రూ.95,000 వేతనం అందించనున్నారు. ఎన్‌టీ పోస్టులకు కనీసం ఏడాది పని అనుభవం, ఎల్‌పీఎన్ పోస్టులకు రెండేళ్ల హోమ్ కేర్ సేవల అనుభవం అవసరం. అభ్యర్థుల వయసు 20 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలి. విద్యార్హతలు, సంబంధిత పని అనుభవం, క్లినికల్ నైపుణ్యాలు, ఆంగ్ల భాషలో సంభాషణ సామర్థ్యానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ వీసా, విమాన ప్రయాణ టికెట్, వసతి సౌకర్యం, వైద్య బీమా తదితర ప్రయోజనాలు కల్పించనున్నట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీని సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సూచించారు.

సంప్రదించాల్సిన వివరాలు: ఫోన్: 08035524946. ఈ-మెయిల్: tomcomglobal@gmail.com.



తెలంగాణ లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీగా అకున్ సబర్వాల్

హైదరాబాద్, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం తాజాగా చేపట్టిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా అకున్ సబర్వాల్‌కు శాంతిభద్రతల విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (అడిషనల్ డీజీపీ -- లా అండ్ ఆర్డర్) బాధ్యతలు అప్పగించింది.సుదీర్ఘకాలం కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్‌పై పనిచేసిన అకున్ సబర్వాల్ ఇటీవల తిరిగి తెలంగాణ రాష్ట్ర క్యాడర్‌లో చేరారు. తాజా బదిలీల్లో భాగంగా ఆయనకు ఈ కీలక పోస్టింగ్ కేటాయించారు. గతంలో డ్రగ్స్ కేసుల విచారణలో ఆయన పేరు వార్తల్లో నిలిచింది.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పోలీస్ శాఖ పనితీరు పర్యవేక్షణ వంటి అంశాల్లో లా అండ్ ఆర్డర్ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో అకున్ సబర్వాల్ నియామకం పోలీస్ శాఖలో ప్రాధాన్యం సంతరించుకుంది.

మహిళా పోలీసులకు పూర్తి యూనిఫాం తప్పనిసరి

హనుమకొండ, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసు సిబ్బంది తప్పనిసరిగా పూర్తి యూనిఫాంలోనే విధులకు హాజరుకావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఆదేశించారు. ఈ మేరకు కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులకు కీలక మెమో జారీ చేశారు.కొంతమంది మహిళా సిబ్బంది అసంపూర్ణ యూనిఫాంతో, మరికొందరు ఖాకీ సల్వార్ కమీజ్ ధరించి విధులకు హాజరవుతున్నట్లు గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెమోలో పేర్కొన్నారు. విధి నిర్వహణ సమయంలో నిర్దేశించిన పూర్తి యూనిఫాం ధరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అయితే గర్భిణులు, తీవ్ర వైద్య సమస్యలతో బాధపడుతున్న మహిళా పోలీసు సిబ్బందికి ఈ నిబంధన నుంచి మినహాయింపు కల్పించారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు సీపీ శ్వేత స్పష్టం చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఆసియా పారా గేమ్స్ స్వర్ణ విజేత దీప్తి జీవంజికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన సన్మానం

హనుమకొండ, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



ఆసియా పారా గేమ్స్--2026లో మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో స్వర్ణ పతకం సాధించిన వర్ధన్నపేటకు చెందిన అథ్లెట్ దీప్తి జీవంజిని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘనంగా సత్కరించారు. హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో దీప్తిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ పోటీలో దీప్తి 56.36 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయిలో దేశ కీర్తిని చాటిన ఆమె విజయం గర్వకారణమని ఎమ్మెల్యే కొనియాడారు. దీప్తి సాధించిన ఘనత నేటి యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దీప్తి ప్రతిభను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆమెకు అందాల్సిన ప్రోత్సాహకాలు, ఇతర ప్రయోజనాలు కల్పించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు.

60 ఏళ్ల తర్వాత కొండగట్టులో చందనోత్సవం

కొండగట్టు, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



సుమారు 500 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆరు దశాబ్దాల తర్వాత చందనోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించిన ప్రధాన ఆంజనేయ స్వామి విగ్రహాన్నే మూలవిరాట్టుగా పిలుస్తారు. ఈ విగ్రహంపై పేరుకుపోయిన చందనాన్ని తొలగించి, భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించనున్నారు.గతంలో ప్రతి మంగళవారం, శనివారం స్వామివారి మూలవిరాట్టుకు చందనం పూసే సంప్రదాయం ఉండేది. ఈ విధంగా ఏళ్ల తరబడి చందనం పూయడంతో ప్రధాన విగ్రహంపై సుమారు నాలుగు అంగుళాల మందంతో చందనం పొర పేరుకుపోయింది. చివరిసారిగా 1965లో ఈ చందనం తొలగింపు ప్రక్రియ చేపట్టారు. తాజాగా ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు శాస్త్రోక్తంగా చందనాన్ని తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.చందనం తొలగింపు అనంతరం కృష్ణా, గంగ, కావేరి, గోదావరి పవిత్ర నదీ జలాలతో పాటు సముద్రపు నీటితో స్వామివారికి అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం నవంబర్ 21 నుంచి భక్తులకు చందనపు పొర తొలగించిన స్వామివారి అసలు విగ్రహ స్వరూపాన్ని దర్శించుకునే అవకాశం కల్పించనున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.ఆరు దశాబ్దాల తర్వాత జరుగుతున్న ఈ చందనోత్సవం, నిజరూప దర్శనం కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు వేలేరు పాఠశాల విద్యార్థినుల ఎంపిక

వేలేరు, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



70వ తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు వేలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఎనిమిదో తరగతి చదువుతున్న జె. సావిత్రి, వి. శృతి అండర్--14 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సత్తయ్య తెలిపారు.సెప్టెంబర్ 30న వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ఈ ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో కామారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.విద్యార్థినుల ఎంపిక పట్ల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి. సునీల్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. సావిత్రి, శృతిని అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

కేయూలో ఎల్ఎల్బీ పరీక్షల నిర్వహణను పరిశీలించిన పరీక్షల నియంత్రణాధికారి

హనుమకొండ, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) పరిధిలో నిర్వహిస్తున్న మూడేళ్ల, ఐదేళ్ల ఎల్ఎల్బీ పరీక్షల తీరును పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కేయూ క్యాంపస్‌లోని కామర్స్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, పరీక్షా కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లపై ఆరా తీశారు.పరీక్షలు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఈ పరిశీలనలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహాచారి పాల్గొన్నారు.

ఈ నెల 25 నుంచి ఇగ్నో టర్మ్ ఎండ్ పరీక్షలు

హనుమకొండ, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) డిసెంబర్--2026 టర్మ్ ఎండ్ పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమై 2027 జనవరి 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వరంగల్‌లోని ఎల్బీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డి.హెచ్. రావు, అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ ఎస్.వి. రమణారెడ్డి తెలిపారు.పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇగ్నో అధికారిక వెబ్‌సైట్ నుంచి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌లో పేర్కొన్న పరీక్షా కేంద్రం, సమయం, ఇతర వివరాలను ముందుగానే పరిశీలించుకోవాలని తెలిపారు.విద్యార్థులు పరీక్షా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని వారు సూచించారు.

పరకాల ఏరియా ఆసుపత్రిలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

బ్లడ్ బ్యాంకు తరలింపు, సీటీజీ యంత్రం ఏర్పాటు వేగవంతం చేయాలి
ప్రసూతి విభాగంలో వసతులు.. 24 గంటల వైద్య సేవలు కల్పించాలి
ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే రేవూరి, కలెక్టర్ సమీక్ష

పరకాల, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



పరకాల నూతన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పెండింగ్‌లో ఉన్న కీలక పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బ్లడ్ బ్యాంకును కొత్త భవనానికి తరలించడం, సీటీజీ యంత్రం ఏర్పాటు, ప్రసూతి విభాగంలో అవసరమైన సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఎమ్మెల్యే ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కొరత, పెండింగ్ పనులు, వివిధ విభాగాల పనితీరును వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

బ్లడ్ బ్యాంకు, వైద్య పరికరాలపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం పాత భవనంలో ఉన్న బ్లడ్ బ్యాంకును నూతన ఆసుపత్రి భవనానికి తరలించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణకు అవసరమైన సీటీజీ యంత్రంతో పాటు ఇతర అత్యవసర వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, రోగులకు శుద్ధమైన తాగునీరు అందించాలని తెలిపారు.

ప్రసూతి సేవలు, 24 గంటల వైద్య సదుపాయాలు

గైనకాలజీ విభాగం, లేబర్ రూమ్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చూడాలని, ఓపీ, ఐపీ సేవలను విస్తరించి ఎక్కువ మంది రోగులకు వైద్యం అందించాలని తెలిపారు. ఆసుపత్రి వార్డులు, పరిసరాల్లో నిరంతరం పారిశుద్ధ్యం పాటించాలని స్పష్టం చేశారు.ఈ-ఔషధి, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాల సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతి విభాగంలో ఉన్న అవసరాలను గుర్తించి పెండింగ్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, పనుల పురోగతిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు, అధికారులు సమస్వయంతో పనిచేయాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు రోగులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం రాహత్ పథకం అమలుపై కూడా వైద్యాధికారులతో చర్చించారు.ఈ సమావేశంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, ఆర్ఎంవోలు డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ ప్రవీణ్, ఇతర వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు: హైదరాబాద్ కొత్త సీపీగా మహేశ్ భగవత్

హైదరాబాద్, నవంబర్ 12, 2026:

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అధికారిక ఉత్తర్వులు (G.O.Rt.No.1654) జారీ చేశారు. ఈ కీలక మార్పుల్లో భాగంగా, శాంతిభద్రతల విభాగం డీజీపీ (L&O)గా విధులు నిర్వహిస్తున్న 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారి మహేశ్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్ (సీపీ)గా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న వి.సి. సజ్జనార్ (1996 బ్యాచ్) ను తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ విభాగం డైరెక్టర్ జనరల్ (డీజీ)గా బదిలీ చేసింది. సజ్జనార్‌కు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF) డీజీగా పూర్తి అదనపు బాధ్యతలు (FAC) కూడా అప్పగించారు.

కీలక విభాగాల్లో నియామకాలు:

శాంతిభద్రతలు, అవినీతి నిరోధక శాఖ, మహిళా భద్రత, ఆర్టీసీ మరియు పౌరసరఫరాల శాఖల్లో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది:

ఏసీబీ & సీఐడీ: అవినీతి నిరోధక శాఖ (ACB) డైరెక్టర్ జనరల్‌గా చారు సిన్హా (1996) నియమితులయ్యారు. ఆమెకు సీఐడీ (CID) డీజీగా పూర్తి అదనపు బాధ్యతలను కూడా అప్పగించారు. మల్టీ జోన్-1 ఐజీగా ఉన్న ఎస్. చంద్రశేఖర్ రెడ్డి (2004) ఏసీబీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు (అవినాష్ మహంతిని అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు).

మహిళా భద్రత & జైళ్ల శాఖ: జైళ్ల శాఖ డీజీగా ఉన్న డాక్టర్ సౌమ్యా మిశ్రా (1994) మహిళా భద్రత (ఔశీవశవఅ ఉ ఝూటవ్ఏ), షీ టీమ్స్, భరోసా విభాగం డీజీపీగా బదిలీ అయ్యారు. ఆమెకు డీజీపీ (ఆర్గనైజేషన్) మరియు డీజీపీ (లీగల్) పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. సౌమ్యా మిశ్రా స్థానంలో స్వాతి లక్రా (1995) జైళ్ల శాఖ డీజీపీగా నియమితులయ్యారు. ఆమె హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

గ్రేహౌండ్స్ & లా అండ్ ఆర్డర్: గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీ (ఆపరేషన్స్)గా విక్రమ్ సింగ్ మాన్ (1998) నియమితులయ్యారు. ఆయనకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న అకున్ సబర్వాల్ (2001) ను శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ (ADGP L&O)గా నియమిస్తూ, కోఆర్డినేషన్ మరియు టెక్నికల్ సర్వీసెస్ (T-Spark) అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఆర్టీసీ ఉ పౌరసరఫరాలు: గ్రేహౌండ్స్ డీజీపీగా ఉన్న డాక్టర్ అనిల్ కుమార్ (1996) ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) వైస్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ (VC&MD)గా బదిలీ చేశారు. ఇప్పటివరకు ఆ స్థానంలో ఉన్న వై. నాగిరెడ్డి (1997) ను పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా మరియు ఎక్స్-అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. నాగిరెడ్డికి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వీసీఉఎండీగా, లీగల్ మెట్రాలజీ కంట్రోలర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.




GOVERNMENT OF TELANGANA
ABSTRACT
IPS – Certain transfers and postings – Notified.
GENERAL ADMINISTRATION (SPL.B) DEPARTMENT
G.O.Rt.No.1654 Dated:12.11.2026
ORDER:
The following transfers and postings are notified:-
1. Dr. Soumya Mishra, IPS (1994), Director General of Prisons & Correctional Services, Telangana, Hyderabad is transferred and posted as DGP, Women & Safety, SHE Teams and Bharosa, Hyderabad. The Member of Service is also placed in full additional charge of the posts of Director General of Police, Organisation and Director General of Police (Legal), until further orders.
2. Ms. Swati Lakra, IPS (1995), Director General of Police, Organisation & Home Guards, Telangana, Hyderabad and HFAC DG, SPF, Telangana, Hyderabad is transferred and posted as Director General of Prisons & Correctional Services, Telangana, Hyderabad vice Dr. Soumya Mishra, IPS (1994). The Member of Service is also placed in full additional charge of the post of Director General of Police, Home Guards, Telangana, Hyderabad, until further orders.
3. Sri Mahesh Muralidhar Bhagwat, IPS (1995), Director General of Police (L&O), Telangana, Hyderabad is transferred and posted as Commissioner of Police, Hyderabad vice Sri V.C. Sajjanar, IPS (1996) transferred.
4. Ms. Charu Sinha, IPS (1996), DGP, CID, Telangana and HFAC DGP, Women & Safety, SHE Teams and Bharosa, Hyderabad and Dir, ACB, Telangana, Hyderabad is transferred and posted as Director General, Anti-Corruption Bureau, Telangana, Hyderabad. The Member of Service is also placed in full additional charge of the post of DGP, CID, Telangana, Hyderabad, until further orders.
5. Dr. Anil Kumar, IPS (1996), Director General of Police (Operations), Greyhounds & Octopus, Telangana, Hyderabad is transferred and posted as Vice-Chairman & Managing Director, Telangana State Road Transport Corporation, Hyderabad vice Sri T. Nag Reddy, IPS (1997) transferred.
6. On transfer, Sri V.C. Sajjanar, IPS (1996) is posted as Director General, Telangana Fire, Disaster Response, Emergency and Civil Defence, Hyderabad vice Sri Vikram Singh Mann, IPS (1998) transferred. The Member of Service is also placed in full additional charge of the post of DG, SPF, Telangana, Hyderabad, until further orders.
7. On transfer, Y. Nagi Reddy, IPS (1997) is posted as Commissioner, Civil Supplies & E.D. Pri. Secretary to Government, CAF&CS Department vice Sri M. Stephen Raveendra, IPS (1998) transferred. The Member of Service is also placed in full additional charge of the post of Vice Chairman & Managing Director, Civil Supplies Corporation and also act as Controller of Legal Metrology, until further orders.
8. Sri Sanjay Kumar Jain, IPS (1997), Additional Director General of Police, TGSP, Hyderabad is placed in full additional charge of the post of Additional Director General of Police, Training until further orders.
9. On transfer, Sri Vikram Singh Mann, IPS (1998) is posted as Director General of Police (Operations), Greyhounds & Octopus, Telangana, Hyderabad, vice Dr. Anil Kumar, IPS (1996). The Member of Service is also placed in full additional charge of the post of Director General of Police, Police Housing Corporation, Telangana, Hyderabad until further orders.
10. On transfer, Sri M. Stephen Raveendra, IPS (1998) is posted as Director, Telangana Traffic Management, Road and Rail Safety Bureau (TG-TMARS), vice Sri Arun Sabharwal, IPS (2001), who is waiting for posting is posted as Additional Director General of Police (L&O), Telangana, Hyderabad. The Member of Service is also placed in full additional charge of the posts of Additional Director General of Police, Coordination and Additional Director General of Police, Technical Services (T-Spark), until further orders.
11. Sri S. Chandrasekhar Reddy, IPS (2004), Inspector General of Police, Multi-Zone-I is transferred and posted as Director, Anti-Corruption Bureau, duly relieving Sri Avinash Mohanthy, IPS (2005) from full additional charge.
12. Sri S. Chandrasekhar Reddy, IPS (2004), Director, Anti-Corruption Bureau, duly relieved is transferred and posted as Inspector General of Police, Multi-Zone-I vice S. Chandrasekhar Reddy, IPS (2004). The Member of Service is also placed in full additional charge of post of Director, ICCC and will report to DGP through ADGP (Intelligence).
13. Sri K. Ramesh Naidu, IPS (2006), Inspector General of Police, Railways & Road Safety, Telangana, Hyderabad is transferred and posted as Inspector General of Police, Railways and will report to Director, TG-TMARS.
14. Sri G. Joel Davis, IPS (2010), Jt. Commissioner of Police, Traffic, Hyderabad City is transferred and posted as Joint Director, Road Safety and Joint Director, Traffic, TG-TMARS. The Member of Service is also placed in full additional charge of the post of Jt. Commissioner of Police, Traffic, Hyderabad City, until further orders.
15. Ms. G. Chandana Deepthi, IPS (2012), Joint Commissioner of Police (Admn. & Traffic), Future City Commissionerate is placed in full additional charge of the post of Deputy Inspector General of Police, Zone-VII, Jogulamba, until further orders, vice Sri L.S. Chouhan, IPS (2009) transferred.
16. Ms. G. Chandana Deepthi, IPS (2012), Joint Commissioner of Police (Admn. & Traffic), Future City Commissionerate is placed in full additional charge of the post of Deputy Inspector General of Police, Zone-VII, Jogulamba, vice Sri L.S. Chouhan, IPS (2009) transferred.
17. Sri R. Bhaskaran, IPS (2012), DIG, CI Cell, Intelligence, Hyderabad is placed in full additional charge of the post of DIG (Intelligence), Telangana, Hyderabad, until further orders.
18. Sri K. Narayana Naik, IPS (2009), Deputy Inspector General of Police, State Crime Records Bureau (SCRB), Criminal Investigation Department (CID), Hyderabad is placed in full additional charge of the post of DIG, Zone-I, Basara.
19. On transfer, Sri L.S. Chouhan, IPS (2009), is posted as Deputy Inspector General of Police, Coordination. The Member of Service is also placed in full additional charge of the post of Deputy Inspector General of Police, Zone-VII, Khammam, vice Sri S. Raju Reddy, IPS (1997) transferred.
20. Ms. Sree Bala Devi, IPS (SPS), who is waiting for posting, is posted as Deputy Director (Admn), Telangana Traffic Management, Road and Rail Safety Bureau (TG-TMARS), Hyderabad.
21. Sri V. Aravinda Babu, IPS (SPS), who is waiting for posting, is posted as DCP, SPA&IT, Hyderabad City.
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
SANJAY JAJU,
CHIEF SECRETARY TO GOVERNMENT.
To
The Members of Service / Officers concerned through the Director General of Police, Telangana, Hyderabad.
The Director General of Police (HoPF), Telangana, Hyderabad.
The Spl. Chief Secretary to Government, Home Department.
The Pay and Accounts Officer, Hyderabad.
The Pri. Secretary to Governor, Raj Bhavan, Hyderabad.
CC to:-
The Secretary to Government of India, Ministry of Home Affairs, North Block, New Delhi – 110 001.
The Principal Accountant General (A&E), Telangana, Hyderabad.
The PS to Principal Secretary to CM.
The P.S. to Chief Secretary to Govt./PS to Secretary to Government (Fin), CAG/CAF & to Joint Secretary to Govt. (GS).
The G. A. (Spl.A/ Spl.C/ Spl.D/ Accom-IV &W&T) Department.
SC/SO.
[FORWARDED/ BY ORDER]
SECTION OFFICER

TG-TMARS

నియామకాలు: పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా ఉన్న ఎం. స్టీఫెన్ రవీంద్ర (1999) ను తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (TG-TMARS) డైరెక్టర్‌గా నియమించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ (2010) ను TG-TMARS రోడ్ సేఫ్టీ మరియు ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా అదనపు బాధ్యతలు కొనసాగించారు. శ్రీబాలా దేవి (SPS) TG-TMARS డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)గా నియమితులయ్యారు. ఇంటెలిజెన్స్ ఉ మల్టీ జోన్లు: ఇంటెలిజెన్స్ ఐజీగా ఉన్న కార్తికేయ (2006) మల్టీ జోన్-1 ఐజీగా బదిలీ అయ్యారు. ఆయనకు ఐసీసీసీ (ICCC) డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఐ సెల్ డీఐజీ ఆర్. భాస్కరన్ (2012) కు డీఐజీ (ఇంటెలిజెన్స్)గా పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇతర కీలక బదిలీలు: కె. రమేశ్ నాయుడు (2006) రైల్వేస్ ఐజీగా బదిలీ అయ్యారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ జాయింట్ సీపీ జి. చందన దీప్తి (2012) కి జోగులాంబ జోన్-7 డీఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్కడ పనిచేస్తున్న ఎల్.ఎస్. చౌహాన్ (2009) ను డీఐజీ (కోఆర్డినేషన్)గా బదిలీ చేస్తూ, చార్మినార్ జోన్-6 డీఐజీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఎస్సీఆర్‌బీ డీఐజీ కె. నారాయణ నాయక్ (2009) కు బాసర జోన్-2 డీఐజీగా అదనపు బాధ్యతలు, వి. అరవింద బాబు (SPS) కు హైదరాబాద్ సిటీ డీసీపీ (SM&IT)గా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రయాణికులకు రైల్వే గుడ్‌న్యూస్.. కాజీపేట, వరంగల్ మీదుగా ప్రత్యేక రైళ్లు

హనుమకొండ, నవంబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):



ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి (సీపీఆర్వో) శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 9 నుంచి 30వ తేదీ వరకు ప్రతి సోమవారం బెంగళూరు--బరౌని ప్రత్యేక రైలు (06587) కాజీపేట మీదుగా ప్రయాణించనుంది. అలాగే బరౌని--బెంగళూరు ప్రత్యేక రైలు (06588) ఈ నెల 12 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు ప్రతి గురువారం కాజీపేట మీదుగా రాకపోకలు సాగించనుంది.వీటితో పాటు ఈ నెల 17వ తేదీన గయా--చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు (03689) వరంగల్ మీదుగా ప్రయాణించనుంది. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సదుపాయాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.